

# బురుజువీధి కథలు

## - కె.వి.రమణరావు



**(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)**

# యాత్రికురాలు

మావీధి మొదట్లో కుడివైపున ఒక గుండ్రటి బురుజుంది. అందుకనే మావీధిని 'బురుజువీధి' అంటారు. కుడివైపున బురుజుంటే, ఎడమవైపున కచేరిసత్రం ఉంది. ఒకప్పటి తాలూకాకేంద్రమైన మావూరు అంతపెద్దదేమీ కాదు. పాతబస్టాండునుంచి చిన్నబజారు దాటుకుని గోశాలరోడ్డులో కొంతదూరం నడిచి బురుజు, కచేరీసత్రాల మధ్య కుడివైపు తిరిగితే అదే మావీధి. అలాతిన్నగా మా వీధిలో నడుచుకుంటూవస్తే చివరన 'హల్యా'నది తగుల్తుంది. అంటే మావీధి డెడ్ ఎండ్ అన్నమాట.

హల్యానది ఒడ్డున ఎడమవైపున అంటే కచేరిసత్రం వరసలో చివరన మార్కండేశ్వరాలయముంది. దానెదురుగా అంటే బురుజువైపు వరసలో చివరన పూర్వజమిందారు విడిదిబంగళా ఉంది. ముప్పైమైళ్లదూరంలోవున్న పూర్వసంస్థానపు జమీందారుగారు తమ కులదైవమైన మార్కండేశ్వరుణ్ణి సేవించుకోవడానికి గుడి ఎదురుగా బంగళా కట్టించుకుని తరచుగా వచ్చివుండేవాడని చెప్తారు. వారి రక్షణకు వీధిమొదట్లోబురుజు నిర్మించారని, అటుపక్కనున్న కచేరి మావీధిలోకి వచ్చే మనుషుల్ని పరీక్షచేసి పంపడానికి కట్టారని అంటారు. అదొకటే కాదని, జమిందారు అనధికారిక రెండోభార్య ఆ బంగళాలో ఉండేదని అందుకని పూజలపేరుతో ఆయన ఇక్కడే ఎక్కువగా కాలంగడిపేవాడని మరో కథ ఉంది.

నదికవతల ఒక మూసేసిన జూట్ మిల్లుండడంవల్ల నదికటువైపుకు దారిలేదు. అంటే మావీధిలో తిన్నగా నడుస్తూవెళ్తే నదిలో పడ్తారు. అందుకే మావూరి ఇతర పేటల్లో ఎవరిమీదైనా కోపంవస్తే 'బురుజువీధిలో నడుస్తూ వెళ్లు' అని తిడతారని వినికిడి.

మావీధి అసలుపేరు 'మార్కండేశ్వరాలయ మార్గ'మని, పామరులు దాన్ని పలకలేక బురుజువీధిని చేసేసారని, పలకలేనివాళ్లు 'బూజువీధి' అనికూడా అంటారని, మావాళ్లు నిరసనగా చెప్తారు. ఒకప్పుడు మావీధి రక్షణకోసం కట్టిన

బురుజుకు రక్షణగా ప్రస్తుతం ఒక ఆర్కియలాజికల్ వాళ్ల బోర్డు, ట్రాన్స్ ఫార్మర్, కంపచెట్లు ఉన్నాయి. అటువైపున్న కచేరి పాడుబడి 'కచేరిసత్ర'మై బిచ్చగాళ్లకు ఆశ్రయంగా ఉంది.

మావీధిలో అన్నీ కలిపి ఇరవైఎనిమిది ఇళ్లు, అందులో పాడుబడినవి రెండు మినహాయిస్తే మొత్తం ఇరవైయారన్నమాట. గొప్పలు చెప్పుకున్నట్టవుతుందిగానీ మావీధి ఒకప్పుడు పండితులు, ధనవంతులైన వ్యాపారులు, జమీందారుగారి సైనికాధికార్లు, సీమరాణీగారి దేశీయ అధికారులతో విలసిల్లేదట. ఇంగువపోయిన బట్టలాగా ఇప్పుడుకూడా అందరూ చదువుకుని మంచి వృత్తుల్లో, ఉద్యోగాల్లో ఉన్నవాళ్లే ఉన్నారు. ఆవిధంగా మావీధి సమాజంలో ముందువరసలో ఉన్నట్టే. మావూరు పాత తాలూకాకేంద్రం స్థాయిలోనే మిగిలిపోవడంతో అంతకుమించి ఎక్కువ ఆశించలేం.

మావీధిలో ఏడు పెంకుటిళ్లు తప్ప అన్నీ మేడలే, కొన్ని మండువాలు. కాకపోతే అందులో అయిదారే ఆధునికంగా తిరిగి కట్టబడ్డవి. కొన్ని పాతయిళ్లకి ముందున అరుగులుంటాయి. కొత్తవాటికి ప్రహరీగోడలున్నా గేటుదాటగానే అరుగులున్న వసారాలుంటాయి. వెడల్పైన మావీధి నదివొడ్డునేవుంది కాబట్టి రెండువైపులా వేప, రావి, బాదం, దిరిశెన, గుల్మొహర్, రామబాణంలాంటి పెద్దచెట్లతో పచ్చగావుంటుంది. అన్నియిళ్లకూ వెనకాల విశాలమైన పెరదుండి అందులో చేదబావి, నాలుగైదు పళ్లచెట్లూ ఉంటాయి, ముందు ఖాళీజాగావుంటే తప్పనిసరిగా పూలచెట్లుంటాయి.

ప్రవేశంలో బురుజు, కచేరిసత్రం చివర్ననది కారణంగా మావీధిలో బయటివాళ్ల సందడి ఉండదు. ఐతే మావీధిలోని వాళ్లమంతా కలివిడిగా ఉంటాం. టీవీలు, సెల్ ఫోన్లున్నా మావాళ్లు సాయంత్రమైతే చాలు ఒకరింటికొకరెళ్లి కబుర్లు చెప్పుకుంటారు. కొంతమంది ఆడవాళ్లు గుళ్లోకలసి పిచ్చాపాటి మాట్లాడుకుంటారు. ఎవరింట్లోనైనా ఏదైనా ప్రత్యేక వంటకం చేసుకున్నా, పొలాన్నించి అలసందలు, అనపకాయలు, చిక్కుళ్లు, తోటల్నుంచి బొప్పాయి, మామిళ్లులాంటివి వచ్చినా సగంవీధికైనా సరఫరా ఔతాయి.

పండగలు, పబ్బాలు వచ్చినప్పుడు మావీధిలోని వాళ్లమంతా కలిసి బాగా జరుపుకుంటాం. కొందరిళ్లల్లో పుట్టినరోజులాంటి సంబరాలు జరిగినప్పుడుకూడా అంతే. పర్వదినాల్లో మాగుడి కళకళలాడుతుంది. అలాంటప్పుడు ధర్మాన్ని నిలబెట్టే హరికథలు, ప్రవచనాలు ఏర్పాటు చేస్తాం. మా ఐకమత్యం అలాంటి సమయాల్లో బాగా కనిపిస్తుంది. అలాగని మావీధిలో గాసిప్ తక్కువేంకాదు. ఊళ్లో ఏదైనా, మావీధిలో ఎవరింట్లో ఏది జరిగినా అందరికీ నిముషాల్లో తెలిసిపోతుంది. ఈ పనిలో మావీధిలోని వనజమ్మ అత్యంత ప్రతిభాశాలి. అందుకే ఆమెను 'వార్తల వనజమ్మ' అంటారు. ఐతే, సెల్ ఫోన్లొచ్చాక ఆమె ప్రాభవం తగ్గింది.

పటేల్ గారి రాజ్యాలవిలీనం తరువాత మా పూర్వజమీందారుగారు మనస్తాపం చెంది చెన్నై వెళ్లిపోతూ విడిదిబంగళాను రాయుడుగారికి అమ్మేసారు. రాయుడుగారేం తక్కువకాదు. వారిదికూడా జమిందారిఫ్యామిదా. మావీధికి ఆయనే పెద్ద దిక్కు. ఆయన కొడుకులు బెంగుళూర్లో పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తూంటారు. మిగతాయిళ్లలో ఆడిటరుగారు, లాయరుగారు, టీచర్లు, నాలాంటి ఉద్యోగులు, వ్యాపారాలున్న ధనవంతులు, పూజార్ల కుటుంబాలు, జ్యోతిష్య శాస్త్రవేత్త, సంస్కృత పండితుడు, మోతుబరి రైతులు ఇలాంటివాళ్లు ఉన్నారు. వీళ్లలో చాలామందికి నదివెంబడివున్న పల్లెల్లో పొలాలున్నాయి.

మాయిల్లు కచేరిసత్రం వరసలో ఆరోయిల్లు. మాపక్కింట్లో అంటే ఏడోయింట్లోవున్న 'పరోపకారి పాండురంగ' చేసేవృత్తి ఎలెక్ట్రికల్ రిపేర్లైనా అందరిళ్లల్లో చనువుగా తిరుగుతూ ఎవరికే అవసరమొచ్చినా అండగా ముందుంటాడు. అతని భార్య సుశీలా అంతే. వారింటి ఎదురుగా, అంటే బురుజువరసలో, గాసిప్ వార్తలను చేరవేయడంలో ప్రతిభాశాలైన 'వార్తల వనజమ్మ' ఉంటుంది. ఐతే, సెల్ ఫోన్లొచ్చాక ఆమె ప్రాభవం తగ్గింది.

మాకంటే ధనవంతులున్న కొత్తకాలనీలు మావూళ్లో మరోవైపు కొన్ని ఉంటే ఉండచ్చుగాక. చారిత్రకంగా, సాంస్కృతికంగా గొప్పవాళ్లుండిన మా బురుజువీధినే మావాళ్లంతా గొప్పదిగా భావిస్తారు. అసలు ఆకాలంలోనే ఒకవీధి మొత్తానికి రక్షణగా ఇళ్లవెనకాల ఒక ఎత్తైన ప్రహరీగోడ ఉండడం ఎవరైనా ఎరుగుదురా? అంటే అప్పట్లోనే మాది గేటెడ్ కమ్యూనిటి అన్నమాట.

ఒక కాలనీకున్నట్టుగా మావీధికే ఒక సంక్షేమసంఘం ఉంది. మావీధిలోని దైనందిన వ్యవహారాలు, సాంస్కృతిక విషయాలు చూడ్డమేకాక ఇళ్లలోకే వచ్చి పంచాయతీలు చేసి న్యాయస్థానంలాగే తీర్పులుకూడా ఇస్తుంది మా సంఘం. అసలు మనసంస్కృతి ఇంకా జీవించివున్న ప్రదేశాల్లో మావీధి ఒకటని మా నమ్మకం. మావీధిలోనే అద్దెకున్న జోసెఫ్ గారు, ఇస్మాయిల్ గారు ప్రతి సోమవారం తప్పకుండా మా గుడికి రావడం దీనికి నిదర్శనం.

జమిందారుపోయినా మామూలుజనం మావీధిలోకి రావడానికి ఇప్పటికీ కొంత జంకుతారు. ఎవరికథ వాళ్లదే ఐనా, మేము అప్పుడప్పుడూ ఒకరింటి అరుగుమీదనో, మరొకరి డ్రాయింగ్ రూములోనో కూర్చుని మా గతచరిత్ర గొప్పదనాన్ని, మావీధిలో ఉండిన ఖచ్చితమైన కట్టుబాట్లను, ప్రపంచం ఎలా దిగజారుతోందన్న విషయాలను చర్చిస్తూవుంటాం.

మావీధి సంక్షేమ సంఘపెద్దలు 'ధర్మో రక్షతి రక్షిత:' సూత్రాన్ని బలంగా నమ్ముతారు. ఊళ్లో ఎక్కడా ధర్మహాని జరక్కుండా చూస్తారు. ఐతే మా సంఘపెద్దలకు మన నిజమైన భారతీయధర్మం పట్ల అంత నిబద్ధతేమీ లేదని, ఇతరులమీద పెత్తనం చెలాయించడానికే ధర్మాన్ని వాడుకుంటారని, తమవరకువస్తే దాన్ని తొక్కిపెట్టేస్తారని శాస్త్రాలు తెలియని కొందరు కిట్టనివాళ్లంటారు. చదువుకుని ఎంతో ఎదిగికూడా, ఆదర్శంగా ఉండాల్సిందిపోయి, కాలంచెల్లిన

భావజాలానికే ప్రాధాన్యత ఇచ్చి వికాసాన్ని అడ్డుకుంటారని కొందరు తెలియనివాళ్లు విమర్శిస్తారు. మాసంఘపెద్దలు ప్రసన్నంగా ఉంటారు, దురుసుగా కాకుండా మెత్తగా మాట్లాడతారు, దీన్ని కూడా కొందరు అసూయాపరులు 'ముఖ-తొడుగు' అని తప్పుపడతారు. కలికాలమంటే ఇదే మరి.

మావీధిలోని చలపతి, కాశీనాథ్ మాత్రం భిన్నంగా ఉంటారు. చలపతి వామపక్షభావాలున్న మనిషి. కాశీనాథ్ ఒక పాతకాలం వేదాంతి. అతను షడ్దర్శనాలు, ఉపనిషత్తులు తప్ప మిగతావన్నీ మనమతం కాదంటాడు, అన్నిమతాల్లోలాగే మనమతంలోకూడా దేవుళ్లు, గుళ్లూ, పురాణాల్లాంటివి తరువాత వచ్చి చేరాయంటాడు. అతను చెప్పే ధర్మం వేరే. ఐతే మావీధిలో అతన్నెవరూ లెక్కపెట్టరు, చాదస్తుడికింద కొట్టేస్తారు.

ఒకసారి యూనివర్సిటీనుంచొచ్చిన నా స్నేహితుడొకడు మా వీధిని చూసి 'మీ వీధి దగాపడిన అన్న'లాగుంది అన్నాడు. నేనాశ్చర్యపోయి 'దగా పడిన తమ్ముడి గురించి విన్నాను, యీ అన్నే'మిటి అనడిగాను. అతను నవ్వి 'అదంతే. తమ్ముడిని చూడాలంటే బజారువీధి దాటి పేటకవతలికెళ్లాక ఇరుకుసందులొస్తాయి అక్కడ చూడు' అన్నాడు. అతనలా ఎందుకన్నాడో ఈసారి కలిస్తే వివరంగా తెలుసుకోవాలనుకున్నాను.

మా వీధి సంక్షేమసంఘానికి గౌరవనీయులైనవాళ్లు పదిమంది సభ్యులు. రాయుడుగారు అధ్యక్షులు, ఆడిటరు నారాయణమూర్తిగారు ఉపాధ్యక్షులు. మామీద ప్రేమతో నన్ను, మాయెదురింటి చలపతిని అదనపు సభ్యులుగా తీసుకున్నారు.

మావీధిలోని చాదస్తాలను వ్యతిరేకించే కొందరు ఆడవాళ్లు అనధికారికంగా మరో సంఘాన్ని పెట్టుకున్నారని మాకు తెలుసు. ఐతే దానికి గుర్తింపు లేకపోవడం, వాళ్ల సంఘం సమావేశాలు పైక్కనపడకుండా జరుపుకోవడం చూసి మేము దాన్ని 'అండర్ గ్రౌండ్ సంఘం' అని ఎగతాళి చేస్తూంటాం. ఆ సంఘంలో మా ఆవిడ కామేశ్వరికూడా సభ్యురాలు. వాళ్లు ప్రచారంలేకుండా సేవాకార్యక్రమాలు చేస్తుంటారు.

నేనోసారి వాళ్లసంఘాన్ని వెటకారం చేస్తే "మాదేదో వుబుసుబోని ఆడవాళ్ల సంఘంలేండి. మరి మీదో? యిప్పుడు విశ్వనాథ సత్యనారాయణగారే వుండివుంటే మీ అధికారిక సంఘానికి 'పది పడగలు' అనే పేరు పెట్టి, అదే పేర్తో మరో నవల రాసివుండేవాడు" అని కామేశ్వరి సెలవిచ్చింది. మాసంఘాన్ని వాళ్లలాగే పిల్చుకుంటార్ట. మా ఆవిడ వ్యంగ్యంగా అన్నా అందులో పొగడ్తకూడా ఉంది కాబట్టి ఆమాటలకి నేను గర్వంగా ఫీలవకపోలేదు.

ఆరోజు ఆదివారం. సాయంత్రం ఏడుగంటలకు మావీధి సంక్షేమసంఘం సమావేశం అధ్యక్షుడు రాయుడిగారి బంగళాలో మొదలైంది. రాయుడుగారు అధ్యక్షుడైనా ఆయన ఎప్పుడోగాని రారు. నారాయణమూర్తిగారే అధ్యక్షత వహిస్తూంటారు. ఇది వార్షిక సమావేశంకాబట్టి ఈసారి వారిబంగళాలోనే పెట్టుకున్నాము.

మావూరు చిన్నదైనా మావీధి సంఘపెద్దలు సామాన్యులుకాదు. నారాయణమూర్తి జిల్లాలోనే పేరొందిన ఆడిటరు. బసవలింగానిది బంగారు వ్యాపారం. మునిరెడ్డి ఆస్తివున్న ఆటోమొబైల్ డీలరు, స్వామినాయుడు ఊళ్లో సాంస్కృతికసంఘ నాయకుడు, సోమయాజులు బీమాకంపెని ఆఫీసరు, బంగార్రాజు బట్టలకొట్టు వోనరు, ధనరాజ్ టోకువ్యాపారి, రంగశాయి ఫైనాన్సియర్, కాశీనాథ్ విశ్రాంత హిందీపండితుడు. శ్రీమతి సుగుణమ్మ ఏకైక స్త్రీసభ్యురాలు. ఆమె భర్త చంద్రయ్య బోలెడుపొలాలున్న ఆసామి. ఆమె అంతగా మీటింగులకు రాదు. అదేవూళ్లో బదిలీలేని చిన్నఉద్యోగాలు చేసుకుంటున్న నేను, చలపతి అదనపు సభ్యులం.

సమావేశం ఐపోయాక నాణ్యమైన అస్సాం టీ తాగుతూ పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నాము. టైము తొమ్మిదౌతోంది.

ఇంతలో పనికుర్రాడొచ్చి మాదేవాలయ పూజారి పద్మనాభయ్య వచ్చి బయట వేచివున్నాడని చెప్పాడు. లోపలికి రమ్మన్నారు. ఆయన వచ్చి అందరికీ నమస్కరించి 'ఎవరో ఒక ముసలామె మధ్యాహ్నం గుడికొచ్చి, వసారాలో పడుకుని గుడి మూసేసే సమయమైనా వెళ్లడంలేదని, ఆమె బక్కచిక్కి, చిరిగిన బట్టలతో, నిస్త్రాణగా ఉందని, ఆమె మాట్లాడే భాష కన్నడంలాగుందని, తనకేంచేయాలో పాలుపోవడంలే'దని చెప్పాడు.

మొదటగా అందరూ ఆమె నిస్త్రాణగా ఉన్నందుకు విచారం, ఆందోళన వెలిబుచ్చారు.

"బిచ్చగత్తె ఐవుంటుంది, ప్రసాదమైనా దొరుకుతుందని వచ్చివుంటుంది పాపం" అన్నాడు నారాయణమూర్తి.

"ఆమెను బయటికి పంపించడమే మంచిది. యెవరో యేమో, రాత్రంతా గుళ్లో యెలావుంటుంది?" సందేహించాడు రంగశాయి.

"అవును ఆమెకేదైనా ఐతే మనకదో సమస్య" అన్నాడు బసవలింగం

రాయుడుగారు చలపతివైపు చూసి "నీకు కొంచెం కన్నడం వచ్చుగదా, మొదట అసలామె పరిస్తితేంటో తెల్సుకుంటే మంచిది. వెళ్లొస్తావా?" అని, నావైపు తిరిగి " సూర్యం, నువ్వుకూడా తోడెళ్తే బావుంటుంది. మీయిద్దరూ ఫ్రెండ్సుగదా" అన్నాడు నవ్వి.

పద్మనాభయ్యతో మేమిద్దరం వెళ్లాము.

"నాకంటే రాయుడికే కన్నడం బాగావచ్చు. పైగా ఆయనింటెదురుగానే గుడి. ఆయనే రావచ్చుగదా" అన్నాడు చలపతి నాతో చిన్నగా.

"యిలాంటి చిన్నమనుషులకోసం రాయుడుగారంతటి మనిషి వస్తే ఆయన పరువేంగాను" అన్నాను.

మేమెళ్లేసరికి అప్పటికే వచ్చిన 'పరోపకారి పాండురంగ', గుడిలో పనిచేసే లక్షుమ్మ ఆమెకు సపర్యలు చేస్తున్నారు. కొద్దిగా ప్రసాదం తిని, నీళ్లుతాగి ఆమె కొంచెం తేరుకుంది.

పద్మనాభయ్య చెప్పినట్టే ఆమె బట్టలు చిరిగి, దుమ్ముకొట్టుకుని వున్నాయి. డెబ్భైయేళ్లుంటాయి. జోలెలాంటిసంచి తప్ప వేరేయేమీ లేదు. మెడలో చివరన శివలింగమున్నరుద్రాక్షమాల ఉంది. రేగినతలతో, కళ్లలో ప్రాణాలు పెట్టుకునివుంది.

చలపతి ఆమెపక్కన కూర్చుని కన్నడంలో ఆమెని వివరాలడిగాడు. ఆమె చెప్పిందిగాని గొంతు బలహీనంగావుండి సరిగ్గా వినపడలేదు. మళ్లీమళ్లీ అడిగి మొత్తంమీద కొంచెం విషయం రాబట్టాడు. ఆమె గుళ్లో మండపంవైపు చూపించి ఏదో అడిగిందిగాని సరిగ్గా వినపడలేదు. ఆతరువాత నీరసంతో కళ్లుమూసుకుని పడుకుంది.

చలపతి రాబట్టిన సారాంశం ప్రకారం ఆమెది కర్ణాటకలోని శివమొగ్గ. పూర్వాశ్రమంలో ఆమె ఒక రంగస్థలనటి. ప్రస్తుతం శ్రీశైలం వెళ్తోంది.

"మాయింటికి ఫోన్ చేసి బొంత, దుప్పటి, నీళ్లబాటిలు పంపమని చెప్తాను. లక్షుమ్మను రాత్రి తోడు పడుకోమని చెప్పండి" అని పద్మనాభయ్యతో చెప్పాడు చలపతి. నేను ఇంటినుంచి పళ్లరసం పంపిస్తానని చెప్పాను.

నేను, చలపతి తిరిగి రాయుడిగారింటికెళ్లాం. చలపతి జరిగిందంతా చెప్పి "నాకు సరిగ్గా అర్థంకాలేదుగాని ఆమె భాష బాగుందని చెప్పగలను. ఆమె వొకప్పుడు స్టేజినటినని చెప్పింది. యీరాత్రికి ఆమె అక్కడే వుండడానికి యేర్పాట్లు చేసాము" అన్నాడు.

"మన డాక్టరుగారిని వచ్చి ఆమెను వొకసారి చూడమంటే మంచిది" అన్నాను.

“ఆమె యెవరైనా అతిథిని ఆదరించడం మనధర్మం” అన్నాడు కాశీనాథ్.

మా సంఘ పెద్దలకు మా సలహాలు నచ్చినట్టు లేదు.

"పాపం దీనస్థితిలోవున్న ఆమెకు సహాయపడవలసిందే. కానీ యెవరో యేమిటో తెలియకుండా ఆమె బాధ్యత తీసుకోవడం వివేకం కాదేమో" అన్నాడు మునిరెడ్డి.

"యేదో డ్రామాయాక్టరంటున్నారు, ఆమెలాంటిదో యేమో. మనవీధిలో, అందులోనూ గుళ్లో, అదీ రాయుడిగారింటి యెదురుగా వుంచడమెందుకు" సందేహించాడు బంగార్రాజు.

"ప్రస్తుతం ఆమె బైరాగులతో యాత్రలుచేసే మనిషిలాగుంది. కచేరిసత్రంలో ఐతే మిగతా బిచ్చగాళ్లు ఆమెకు తోడుగావుంటారు" చెప్పాడు స్వామినాయుడు.

"పాపం ఆడమనిషిని బలవంతంగా యెలా పంపిస్తాం? పోలీసులకు చెప్తే వాళ్లే జాగ్రత్తగా తీసుకుపోయి మన కచేరిసత్రంలో పెడతారు" సూచించాడు బసవలింగం.

అందరూ అదే మంచిదంటూ రాయుడుగారివైపు చూసారు.

"యిలాంటి పనంటే పోలీసులక్కూడా తలనొప్పి. అదే ఆలోచిస్తున్నాం" అన్నాడు మూర్తి. రాయుడుగారు తలవూపారు.

"యిప్పుడామె కదిలే స్థితిలో లేదు. నీరసంతప్ప ఆమెకు అనారోగ్యమేమీ వున్నట్టులేదు. యీరాత్రికి ఆమెను అక్కడే సౌకర్యంగా వుంచేట్టు నేను చూసుకుంటాను. తరువాత సంగతి పొద్దున ఆలోచించచ్చు" అన్నాడు చలపతి లేస్తూ.

"యెందుకైనా మంచిది, డాక్టర్ను పిల్చుకొచ్చి చూపిస్తాను" అన్నాను నేనూ లేచి.

"సరే మీయిద్దరూ చూసుకోండి. కానీ యేసమస్యా రాకూడదు. పొద్దున గుడి తెరిచేసరికల్లా ఆమెను పంపించేయండి. యేదైనా అవసరమైతే మాకు ఫోన్ చేయండి" అన్నాడు మూర్తి. మిగతావాళ్లు 'అంతే' అన్నట్టు మావైపు చూసారు. మేం బయటికొచ్చేసాం.

ఆతరువాత నేను డాక్టరును తీసుకొచ్చి చూపిస్తే ఆయనకూడా 'నీరసం తప్ప ఏమీ లే'దని బలం ఇంజక్షన్ ఒకటిచ్చి వెళ్లాడు. లక్షమ్మకు జాగ్రత్తలు చెప్పి మేం బయటికొచ్చాం.

ఇవన్నీ చూసుకుని నేనింటికెళ్లేసరికి ఆలస్యమైంది.

"ఆముసలావిడను చూస్తే బిచ్చగత్తెలాగ కనిపించడంలేదు. మాట, తీరు వేరేగా వున్నాయి" అన్నాను మాఆవిడ కామేశ్వరితో.

"నేను పాలుతీసుకెళ్లి యిచ్చినప్పుడు చూసాను. ఆమెకు యివూరు, గుడి తెలిసినట్టుగా అనిపిస్తోంది. నిజమే, పెద్దకళ్లూ అవీ, కళాకారిణి లక్షణాలు కనిపిస్తున్నాయి. వొకప్పుడు బాగాబతికి చితికిపోయిన మనిషిలాగుంది. ఐనా మీ సంఘపెద్దలు యిలాంటి దీనావస్థలో వున్నవాళ్లని దగ్గరికి రానిస్తారా? రేప్పొద్దునకి ఆమె తేరుకుంటే మనింటికి తీసుకురండి. రెండ్రోజులుండి శక్తివొచ్చాక వెళ్తుంది" అంది కామేశ్వరి.

"మా సంఘపెద్దలను యేదోవొకటి అనకపోతే నీకు తోచదుగాని, ఆస్థితిలో యెవరైనా అలాగే ఆలోచిస్తారు. యిప్పుడామె కదల్లేదు, పొద్దున తీసుకొద్దాం" అంటూ స్నానానికి వెళ్లాను.

ఆరాత్రి ఆమె మొహమే గుర్తొచ్చి నిద్ర సరిగ్గా పట్టక పొద్దున లేచేసరికి ఆలస్యమైంది.

నేను తయారై వంటింట్లోకెళ్లేసరికి కామేశ్వరి 'వార్తల వనజమ్మ' మోసుకొచ్చిన సమాచారం విని అప్పుడే బయటనుంచి లోపలికొచ్చింది, "పొద్దునలోపే యెంతమార్పు?" అంది నవ్వుతూ

"మీ ఆడవాళ్ల వార్తాచానెల్ తెల్లారకముందే లేచినట్టుందే, యేమైంది?" అనడిగాను.

"రాత్రి పొద్దుపోయాక రాయుడిగారికి బెంగుళూరునుంచి ఫోన్ వచ్చిందట. నిన్న మన గుళ్లో దీనస్థితిలో వుండిపోయిన ముసలావిడ పూర్వాశ్రమంలో చాలాపెద్ద పేరున్న నటీమ ణి. అనేక బిరుదులొచ్చాయి. గొప్ప దానధర్మాలు చేసిన కోటీశ్వరురాలు. ఆమె చుట్టాలంతా పెద్ద హోదాల్లో, పదవుల్లో వున్నారట" అంది కాఫీకి నీళ్లు పెడుతూ.

"మరి యీ అవస్తేమిటి? యిలారావడమేమిటి?" అన్నా ఆశ్చర్యపోతూ.

"ఆవిడ ఆస్తంతా దానధర్మాలుచేసి శివభక్తురాలిగా సాధారణజీవితం గడుపుతూందట. ప్రతిసంవత్సరంలాగే యీసారికూడా శ్రీశైలందగ్గరి అక్కమహాదేవి గుడికి యాత్రకు వెళ్తూ మధ్యలో యెక్కడో దిగినప్పుడు పొరపాటుతో వాళ్లబస్సుకాక మరో యాత్రాబస్సు యెక్కేసింది. వుపవాసాలమీద నీరసమొచ్చి పడిపోతే వాళ్లు మరెక్కడో దించేస్తే చివరికెలాగో యీవూరొచ్చింది. ఆమెచుట్టాలు యెలాగో తెల్సుకుని రాయుడుగారికి ఫోన్ చేసారట. అదీ జరిగింది"

"అంటే యీవూరిని, మన గుడిని గుర్తుపట్టి వచ్చిందా?"

"యీవూరొచ్చాక గుర్తుపట్టినట్టింది. యెందుకంటే మన గుడికట్టేప్పుడు ఆవిడ యిక్కడికొచ్చి పెద్ద గుప్తదానం చేసిందట. గుళ్లో పడమటివైపున్న మంటపాన్ని ఆమే కట్టించిదట"

"అవును, దానిమీద 'అనుభవ మంటప' అని కన్నడలో పేరు చెక్కారు. కానీ అది రాయుడుగారు కట్టించారని అంటారే"

"అది ఆవిడ కట్టించిందేనట. కానీ మనవాళ్లు దాన్ని వుద్దేశించిన పనిక్కాకుండా మిగతా అన్నిటికీ వాడుతున్నారు. యీవిడ చేసేవన్నీ గుప్తదానాలేనట. రాయుడుగారు ఆమెపేరు చెప్పకుండా ఆమెపంపించిన డబ్బుమాత్రం యిచ్చివుంటారు, అది ఆయనపేరుమీద చలామణి అవుతోంది. యెంతైనా తెలివైన నాయకుడుకదా"

"దానికాయనేం చేస్తాడు, ఆయన తనపేరు రాయించుకోలేదుకదా. అది సరే యిప్పుడావిడకెలావుంది? యింటికి తీసుకురానా?"

"యేలోకంలో వున్నావు? ఆవిడను రాత్రే రాయుడిగారింటికి మార్చారు. ఆవిడెవరో తెలిసాకకూడా యింకా అక్కడే వుంచుతారా మీవాళ్లు? కాఫీతాగి వెళ్లి చూసిరా" అంది కాఫీ కప్పు నాచేతిలో పెడుతూ.

నేను కాఫీతాగి వీధిలోకొచ్చేసరికి అప్పుడే చలపతి కూడా బయటికొచ్చాడు. ఇద్దరం రాయుడుగారి బంగళాకెళ్లాం.

అక్కడ హాలుపక్కనున్న గెస్టురూంలో ఆవిడవుందంటే వెళ్లాం. మేమా ఏసీగదిలోకి వెళ్లేసరికి ఆవిడ నీరసంగాఉన్నా స్నానంచేసి, కొత్త నూలుచీర కట్టుకుని శుభ్రంగాఉంది. ఒకవైపున చాపమీద కూర్చొని నెమ్మదిగా ఏదో మాట్లాడుతోంది. అందుబాటులో నీళ్లూ, వెండి పళ్లెంలో పళ్లూ అన్నీ అమర్చివున్నాయి. ఆమె ఎదురుగా నేలమీద పరచిన

తివాచిపైన రాయుడుగారు ఆశీనులయ్యారు. ఆ వెనక మరో పెద్దతివాచిమీద మా సంఘ పెద్దలంతా కూర్చున్నారు. అందరూ చేతులుకట్టుకుని భక్తిశ్రద్ధలతో ఆమెమాటలు వింటున్నారు.

స్టేజిమీద ఆమె గొప్ప నటీమణే కావచ్చు కానీ స్టేజియెదురుగా కూర్చున్న ప్రేక్షకుల్లో 'అవసరాన్నిబట్టి నటనలో జీవించేవాళ్లుంటారని' పాపం ఆమెకు తెలుసో లేదో!" అన్నాడు మా యెదురింటి చలపతి నాతో, నవ్వుతూ చిన్నగా.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments